రమణీయం.. చెన్నకేశవుడి రథోత్సవం


అశేష భక్త జనం మధ్య తరలిపోతున్న స్వాముల వారి రథం


రథానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: మండల కేంద్రంలో శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది, స్వాముల వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, ఈఓ మద్దిలేటి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు తోట అనూష, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి పల్లకీలో ఆశీనుల చేశారు. ఆలయ పురోహితులు నారాయణశర్మ రథాంగ హోమం, కుష్మాండబలి పూజలు చేశారు.పల్లకీని ఆలయ ప్రాంగణం నుంచి రథం వద్దకు చేర్చారు. రథానికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను రథంపైన అధిష్ఠింపజేశారు. స్థానిక ఎమ్మెల్యే రథానికి పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. అశేష భక్త జనసందోహం మధ్య తరలిపోతున్న స్వాముల రథాన్ని భక్తులు కనులారా వీక్షించి, రథం పైకి భక్తులు పూలు, పండ్లు విసురుతూ పరవశించి పోయారు. భక్తులు కరతాళ ధ్వనులు, గోవింద నామస్మరణ, భారీ బాణ సంచా పేలుళ్లు, డప్పుల శబ్దాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కొంత దూరం తీసుకెళ్లిన రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తూరులో ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయాధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పూజలు చేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలకగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేసి శేషవస్త్రాలతో సన్మానించారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన


తలసేమియా బాధితుల కోసం కోడుమూరు పీహెచ్‌సీలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

కోడుమూరు రూరల్: తలసేమియా దినోత్సవం పురస్కరించుకుని కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం వైద్య సిబ్బంది రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ప్రారంభించగా 40 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోసినవారవుతారన్నారు. తలసేమియా బాధితులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. పీహెచ్‌సీ వైద్యులు హరి, రంజిత్‌నాయక్, పుష్పలత, టెక్నీషియన్ సుబ్బలక్ష్మయ్య, సిబ్బంది కిరణ్, మహబూబ్‌బాషా, దినేష్ రెడ్డి, ఉమేష్ తదితరులున్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

సి.బెళగల్: దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యుడు మిథున్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన కొత్తకోట గ్రామంలో పర్యటించి పరిసరాల శుభ్రత, దోమల నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణపై ఆయా గ్రామల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ పరిసరాలలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఫ్రైడే - డ్రైడేలో భాగంగా నిల్వ నీటి తొలగింపుపై వైద్య సిబ్బందితో ప్రత్యేక కార్యక్రమం చేపట్టి, మురుగు కాలువల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ విడుదల చేయడం వంటి కార్యక్రమాలను ఆరోగ్య శాఖ పర్యవేక్షిస్తుందని డాక్టర్ తెలిపారు. సి.బెళగల్‌లో హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ ఆధ్వర్యంలో మురుగు నిల్వ నీటి కాలువలలో ఆయిల్ బాల్స్ విడుదల చేశారు. ఏఎన్‌ఎంలు అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి, ఆశాలు జమాల్‌బీ. ఉషారిణి, జ్యోతి, లత తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి


పోలకల్‌లో రైతులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం పోలకల్ గ్రామ సచివాలయంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సభ్యులు, వ్యవసాయ సిబ్బందితో చర్చించి రైతు భరోసా సంచికలను రైతులకు అందజేశారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను అందిస్తోందని, అవసరమైన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని సూచించారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, సంక్షేమ పథకాలను వివరించారు. సూక్ష్మ పోషకాలైన జింక్, జిప్సంలను సైతం రాయితీపై అందిస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన మధుశేఖర్

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలో ప్యాలకుర్తి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరుకు చెందిన ముగ్గురు యువకులు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. గూడూరుకు చెందిన మధుశేఖర్ (24), గోవర్ధన్, వెంకట్రాముడు బైక్‌పై కోడుమూరు వైపు వస్తూ కర్నూలు నుంచి కర్ణాటక వైపు వెళుతున్న కారును వెనుకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మధుశేఖర్‌కు తీవ్ర గాయలవ్వగా, గోవర్ధన్, వెంకటరాముడు స్వల్పంగా గాయపడడంతో స్థానికులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మధుశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేదు

కోడుమూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోగా రైతులంతా పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శుక్రవారం కోడుమూరులోని రైతు భరోసా కేంద్రం -1లో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో ఏఓ రవిప్రకాష్ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులంతా పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకోవాలని, ఎరువులు, విత్తనాలకు కొరత లేదన్నారు. లూజు విత్తనాల జోలికి వెళ్లకుండా వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణల్లో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎరువుల, విత్తనాలకు సంబంధించిన సమాచారం ఆర్బీకేల్లోని సిబ్బందిని సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది రసూల్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప శ్రీచక్ర యజ్ఞం


అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కర్నూలు రోడ్డులో నిర్మిస్తున్న ధర్మపురి క్షేత్ర అయ్యప్ప శ్రీధర్మశాస్త్ర ఆలయ నిర్మాణంలో భాగంగా శుక్రవారం శ్రీచక్ర మహాయంత్ర అర్చనాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. యజ్ఞంలో భాగంగా మహాగణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, యాగసంకల్పం, సామూహిక శ్రీచక్ర మహాయంత్ర నవావరణార్చన, స్థాపిత సర్వతోభద్రమండల దేవతాహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులుఘనంగా నిర్వహించారు.

ఆలయ నిర్మాణం అద్భుతం: ఎంపీ సంజీవ్‌కుమార్

కోడుమూరులో నిర్మిస్తున్న శ్రీధర్మపురి క్షేత్ర అయ్యప్ప ఆలయ నిర్మాణం అద్భుతంగా సాగుతోందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణంలో జరుగుతున్న శ్రీచక్ర మహాయంత్ర అర్చనాయజ్ఞంలో ఎంపీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం కోసం తన వంతుగా రూ.5 లక్షలను విరాళంగా ప్రకటించడంతో పాటు, ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రముఖుల పూజలు

అర్చనాయజ్ఞం కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్మన్ రఘు, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు అమడగుంట్ల కృష్ణారెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోండి


కోడుమూరు కస్తూర్బా పాఠశాలలో శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న సునీత

కోడుమూరు రూరల్: ఇంటర్ ఫెయిలైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని బాలిక శిశు అభివృద్ధి జిల్లా అధికారిణి సునీత సూచించారు. శుక్రవారం కోడుమూరులోని కస్తూర్బా పాఠశాలలో శిక్షణా తరగతులను సునీత తనిఖీ చేశారు. తరగతులు నిర్వహిస్తున్న విధానంపై ప్రిన్సిపాల్ గౌసియాబేగంతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు నిరుత్సాహ పడకుండా శిక్షణా తరగతుల్లో చక్కగా చదువుకుని పాసవ్వాలన్నారు. లెక్చరర్లు చెప్పిన వాటిని శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలని, అర్థంగాకపోతే మరోసారి అడిగి చెప్పించుకోవాలన్నారు. బాలికలు విద్యలో రాణించాలని సూచించారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయండి


మంచినీటి వినియోగంపై గ్రామస్తులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: సచివాలయ ఉద్యోగులు వలంటీర్లను సమన్వయం చేసుకుని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా కృషిచేయాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. వారు శుక్రవారం మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, పోలకల్ గ్రామాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయా గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీచేసి ఉద్యోగులు హాజరు, రికార్డులు, విధులు, సచివాలయ నిర్వహణను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని, ఎట్టి పరిస్థితులలోనూ అర్జీ రీఓపెన్ కాకూండా చూడాలన్నారు. సచివాలయ సేవలు విస్తృతం చేసి ప్రతిరోజు కనీసం పది సేవలను కల్పించాలని ఉద్యోగులను అదేశించారు. పోలకల్ గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తాగునీటిపై జాగ్రత్తలు తీసుకోండి

ముడుమాల గ్రామంలో పారిశుద్ధ్య పనులు, మంచి నీటి వినియోగంపై సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించిన తహసీల్దార్, ఎంపీడీఓ గ్రామస్తులతో మాట్లాడారు. మండలంలో వర్షాలు విరివిగా కురవడంతో మంచినీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, ప్రజలుకాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలన్నారు. నదితీర గ్రామాల ప్రజలు తాగునీటిపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

గడప గడపలో సంతోషం

• ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


కొండారెడ్డి నగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు నగరం 39వ వార్డులోని కొండారెడ్డి నగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు నగర పాలక సంస్థ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హత ఉంటే గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తామని ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని తూచ తప్పకుండా నెరవేర్చారని గుర్తు చేశారు. సంక్షేమమే అజెండాగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నగర పాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్ సాంబ, వైస్ ఎంపీపీ-2 నెహమ్యా, సచివాలయ కన్వీనర్లు నారాయణ, ఇస్మాయిల్, కోటేశ్వర్ రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని శకునాల గ్రామంలో చెన్నకేశస్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలో మొత్తం 9 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు గ్రామ రైతు సంఘం నాయకులు తెలిపారు. పోటీల్లో నంద్యాల జిల్లా, అలగనూరుకు చెందిన రోలీమేడం (బీరం బుల్స్) వృషభాలు తొలి బహుమతి రూ.40 వేలు గెలుచుకున్నట్లు చెప్పారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన ఎస్ కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ (చిన్న జత) రూ.30 వేలు, గద్వాల జిల్లా, గోర్లఖాన్‌దొడ్డికి చెందిన కురువ కర్రెప్ప, వెంకటేష్‌నాయక్ సంయుక్త జత వృషభాలు రూ.25 వేలు, నంద్యాల జిల్లా, కాకనూరు నర్ల నాగేశ్వరరెడ్డి వృషభాలు రూ.20 వేలు, కర్నూలు జిల్లా, సోమయాజులపల్లె నరసయ్య వృషభాలు రూ.10 వేలను దక్కించుకున్నాయి. పోటీలకు వాడాల రామనాయుడు, శేఖర్‌రెడ్డి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

సుంకేసులకు 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 850 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

సి.బెళగల్‌లో తేలికపాటి వర్షం

సి.బెళగల్: మండలంలో గురువారం అర్ధరాత్రి తర్వాత తేలికపాటి వర్షం కురిసింది. చిన్న చినుకులతో శుక్రవారం ఉదయం కురవడంతో మండలవ్యాప్తంగా 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. వర్షంతో మండలంలోని ప్రజలు, ఎండుమిరప, మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దిగుబడులు వర్షానికి తడవకుండా పట్టలు కప్పి ఉంచారు.

శాంతిరాం కళాశాల ఘనత

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలకు కేరీర్స్ 360 చేసట్టిన సర్వేలో ఏ ప్లస్‌ప్లస్ కేటగిరీ సాధించిందని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ సంస్థ వారు కళాశాలలో ప్లేస్‌మెంట్స్, వసతులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఉపాధి కల్పన, టీచింగ్ తదితర అంశాలపై సర్వే చేసి కేటగిరీ ప్రకటించారన్నారు.

మద్దిలేటిస్వామి కల్యాణం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు సమీపంలో గల చింతలమునిస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీలక్ష్మిమద్దిలేటి నరసింహ స్వాముల వారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. నన్నూరుకు చెందిన కర్రెన్న, చిన్న ఎర్రమల స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను విరాళంగా అందించడంతో రెండు రోజుల పాటు ఉత్సవాలను జరిపారు. శుక్రవారం స్వాముల వారికి కల్యాణం ఘనంగా నిర్వహించగా భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం చెందారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

కర్నూలు (న్యూటౌన్): పరిసరాల శుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరమవుతాయని కర్నూలు మండల ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం ఉల్చాల, ఎదురూరు గ్రామాల్లో పరిసరాలను గ్రీన్ అంబాసిడర్స్‌తో శుభ్రం చేయించారు. దోమలకు ఆవాసంగా ఉన్న కాల్వల్లో, మురుగు నీరు నిల్వ చోట ఇంజిన్ ఆయిల్‌తో పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వీధుల్లో గ్రీన్ అంబాసిడర్స్‌చే దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో శుక్రవారం గ్రామ నాభిలింగ, సుంకులాపరమేశ్వరీ దేవి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఉదయం నుంచి ప్రజలు గ్రామ నాభిలింగ, సుంకులాపరమేశ్వరీ దేవి, ధ్వజ స్తంభాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయండి

• జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె వీడియోకాన్ఫరెన్స్ ద్వారా స్పందన, రీసర్వే, మ్యుటేషన్ ఇతర రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సెబ్ పోలీసు స్టేషన్‌లు, టూరిజం స్పాట్లకు భూ కేటాయింపులు త్వరగా చేయాలన్నారు. ఇందు కోసం అవసరమైన ప్రతిపాదనలను వెంటనే పంపాలని సూచించారు. రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్‌ను మే 15వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెనుకబడిన మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్పందనలో రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గడివేముల: వివిధ పనుల నిమిత్తం వచ్చే కార్యాలయానికి వచ్చే వారికి అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో కార్యాలయాలకు వచ్చే వారిని తమ చుట్టూ తిప్పకోవద్దన్నారు. విధుల పట్ల అలసత్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మాధవ, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అందరికీ ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత


గుర్తించిన పనులను వివరిస్తున్న దృశ్యం

గడివేముల: ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో అందరికీ ఆమోదయోగ్యమైన పనులను గుర్తించాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఒండుట్ల గ్రామంలో ప్రజలు, రైతులతో సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 22 పనులను సభలో అమోదించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఏపీఓ వెంకటరమణకు సూచించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఎల్‌కే తాండ, గని గ్రామాల్లోని లేఅవుట్‌ను పరిశీలించారు. ఏపీఎం హజరత్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు


మూడు రోజుల పసికందుకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ తేజస్విని

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ చేపట్టిందని వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని తెలిపారు. శుక్రవారం బూజునూరు గ్రామంలోని సచివాలయం వద్ద దాదాపు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగులతో పాటు బాలింతల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

గడివేముల: పంటలను సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గడిగరేవుల, పెసరవాయి గ్రామాల్లో అంతర్జాతీయ చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటల సాగులో వ్యవహరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. చిరుధాన్యాల్లో పీచు పదార్థాలు, మాంసకృతులు, ఖనిజాలు అధిక మొత్తంలో ఉంటాయన్నారు. మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రేపు నవ్వుతో వైద్యం సదస్సు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన నవ్వుతో వైద్యం గురించి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్న సదస్సులో అంతర్జాతీయ మిమిక్రీ ఆర్టిస్ట్ జె.రమేష్ చేత మిమిక్రీ ఉంటుందన్నారు.

సకాలంలో ఎరువులు అందించండి


రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

ఓర్వకల్లు: రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు వంద శాతం ఎరువులను అందజేయాలని మత్స్య శాఖ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జితేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి జితేంద్రనాథ్‌రెడ్డితో పాటు, ఎస్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ధాకూర్‌దినేష్ స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాల పనితీరు, అధికారుల విధులు, బాధ్యతల గురించి ఆరాతీశారు. రాబోయే ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, మందులను పూర్తిస్థాయిలో అందజేయాలని సూచించారు. కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ తోట అనూష, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు రైతులు పాల్గొన్నారు

లక్ష్మీనృసింహ స్వామి రథోత్సవం


ముదుమలగుర్తిలో రథోత్సవ దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం ముదుమలగుర్తి గ్రామంలో వెలసిన శ్రీనవరత్నాల లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం కనులపండువగా సాగింది. ముందుగా స్వామి అమ్మవార్లకు వేద పండితులు అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించగా, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల విగ్రహాలను రథంపై ఉంచి గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.